ప్రజాశక్తి

బుధవారం 18 అక్టోబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# దుర్వాసన మధ్యే బతుకులు

- నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించని ప్రభుత్వం
- హామీలతో నెట్టుకొస్తున్న వైనం
- మంచినీటికీ నోచుకోని ప్రజలు
- ఇదీ పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్‌కు భూములిచ్చిన గ్రామాల దైన్యస్థితి

పరిశ్రమను ఆనుకుని ఉన్న చినపూడి

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

జిల్లాలో పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్‌కు భూములు తీసుకునే క్రమంలో కొన్ని గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా ప్రభుత్వాలు వదిలేశాయి. తరలించని గ్రామాలిప్పుడు పరిశ్రమల మధ్యన దుర్వాసన నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. భూగర్భ జలాలు కలుషిత మవడంతో మంచి నీటికీ నోచుకోవడం లేదు. తాడి, చినపూడిలో వాటర్ టిన్‌లు కొనుక్కొని తాగుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు.

పరవాడ మండలంలోని ఫార్మా సిటీ కంపెనీలకు ఆనుకొనివున్న తాడి, అచ్యుతాపురం మండలం చినపూడి, దుప్పుతూరు, చినతాళ్లదిబ్బ గ్రామాలకు పునరావాసం కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. ఇప్పుడాగ్రామాలను తరలించకపోవడంతో పరిశ్రమల కాలుష్యంతో ప్రజలు కాలం గడుపుతున్నారు. పునరావాసం కల్పించి గ్రామాలను తరలించాలని వారు ఎంత మొత్తు కొంటున్నా ప్రభుత్వాలు పట్టించు కోవడంలేదు. వారం పది రోజుల్లో తాడి తరలింపునకు అవసరమైన రూ.56 కోట్లు ఇచ్చి న్యాయం చేస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. వాస్తవానికి తాడి ప్రజలకు పునరావాసం కల్పించి, తరలించడానికి ఆ నిధులు సరిపోవు. కనీసం తరలించడానికి తగిన చర్యలేవీ ఈ నాటికీ ప్రభుత్వం చేపట్టలేదు.

నిర్వాసిత గ్రామాల తరలింపు దశాబ్దాల తరబడి ఎన్నికల హామీగా ఉంటోంది తప్ప అమలుకు నోచుకోవడంలేదు. ఫార్మా కంపెనీలకు వందమీటర్ల దూరంలోని తాడి ప్రజలు పరిశ్రమల వాసన భరించలేక, రోగాలతో బాధపడలేక ఊరువదిలి వెళ్లిపోతున్నారు. భూములు వదులుకోలేక కొంతమంది కాలుష్య బాధలు భరించుకుంటూ బతుకు వెళ్లదీస్తున్నారు. తాడి, చినతాడి, బిసి కాలనీని మిగతా 2లో..

నేడు అనకాపల్లిలో..

## 'సహకార రంగాన్ని కాపాడుకుందాం' సదస్సు

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి :** 'సహకార రంగాన్ని కాపాడుకుందాం' అన్న అంశంపై బుధవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి కాంప్లెక్స్ ఎదురుగావున్న కార్మిక, కర్షక భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు పి.అజయ్‌కుమార్, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

## పకడ్బందీగా భారత్ - ఆసీస్ టి 20 మ్యాచ్

ఏర్పాట్లుపై సమీక్షించిన నిర్వహణ కమిటీ

మాట్లాడుతున్న ఎసిఎ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి

**ప్రజాశక్తి - పిఎం.పాలెం :** పకడ్బందీ ఏర్పాట్లు నడుమ భారత్ - ఆసీస్ టి 20 మ్యాచ్ నవంబర్ 23న మధురవాడ లోని వైఎస్ఆర్ ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరుగనుందని నిర్వహణ కమిటీ తెలిపింది. ఈ అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహణపై మంగళవారం కమిటీ తొలి సమావేశం స్టేడియంలో జరిగింది. జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర సిపి ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ, ఎసిఎ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ స్టేడియంలో పలు మ్యాచ్‌లను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. భారత్, ఆసీస్ మధ్య జరిగే మ్యాచ్‌కు సంబంధించి టిక్కెట్ల ధరలు, అమ్మకాలపై మరోసారి భేటీ అయ్యి నిర్ణయం తీసుకుంటామన్నారు. టికెట్ల పంపిణీలో పారదర్శకంగా వ్యవహరిస్తామన్నారు. విక్రయాలలో సామాన్యులకు పెద్ద పీట వేస్తూ చర్యలు తీసుకుంటామని మిగతా 2లో..

### జలజీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యం

▶ వార్త 6లో..

### అర్థాంతరంగా ముగిసిన 'ఉక్కు' బోనస్ చర్చలు

▶ వార్త 4లో..

### పోలీసు స్టేషన్ గేటుకు మహిళ తాళం

▶ వార్త మెయిన్‌లో..

సమీక్షా సమావేశంలో అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సురేష్

## అభివృద్ధి పనులు ఆగకూడదు

మంత్రి ఆదిమూలపు సురేష్

వార్త మెయిన్‌లో..

## విశాఖ పోర్టుతో పలు సంస్థలు ఎంఒయులు

ముంబయి గ్లోబల్ సమ్మిట్ వేదికగా సంతకాలు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

ముంబయిలో జరుగుతున్న గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ, పలు సంస్థల మధ్య ఎంఒయులు కుదిరాయి. కేంద్ర పోర్టులు నౌకా జలరవాణా శాఖా మంత్రి శరబానంద్ సోనోవాల్ సమక్షంలో మంగళవారం కొన్ని ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోడీ ముంబయిలో జరుగుతున్న గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ 2023ను ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించగా విశాఖ నుంచి పలువురు అధికారులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ రెండు ఎంఒయులను కుదుర్చుకుంది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రస్తుతం కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకూ ఉన్న నాలుగు లైన్ల రోడ్డును ఆరులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. అందుకోసం పోర్టు రూ.501 కోట్లను వెచ్చించనుంది.

మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

**నేవీతో ఒప్పందం**

ఔటర్ హార్బర్‌ను అభివృద్ధి చేసేందుకు ఇండియన్ నేవీతో పోర్టు మరో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ఔటర్ హార్బర్‌లో నేవీ పలు అభివృద్ధి పనులు చేపట్టనుంది. రెండు ఎంఒయూలపై పోర్టు తరపున ఛైర్మన్ మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయి..**

## దుర్వాసన మధ్యే బతుకులు

తరలించాలని తాడి బాధితుల సంక్షేమ సంఘం నేతృత్వంలో జరిగిన పోరాటంతో టిడిపి ప్రభుత్వం ఎన్నికలకు కొద్ది రోజుల ముందు 2019 ఫిబ్రవరి 6న రూ.57.63 కోట్లు విడుదల చేస్తూ జిఒ 29 విడుదల చేసింది. ఆ తరువాత కాలంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.56 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించింది. ఈ రెండు ప్రభుత్వాలూ గ్రామాన్ని తరలించడానికి ముందు చేపట్టాల్సిన నిర్వాసితుల గుర్తింపు సర్వే ప్రారంభించలేదు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇళ్లతో పాటు భూములకు పరిహారం, అర్హులందరికీ పునరావాసం కల్పించి సురక్షిత ప్రాంతానికి తరలిస్తే వెళ్లిపోతామని తాడి, చినపూడి, దువ్వుతూరు, చినతాళ్లదిబ్బ గ్రామస్తులు చెబుతున్నారు. విద్యార్హతలున్న స్థానికులకు, నిర్వాసిత కుటుంబాలకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాల కల్పన జిఒను కంపెనీల యాజమాన్యాలు అమలుచేయడంలేదు. ప్రభుత్వమూ చిత్తశుద్ధితో అమలుచేసే పని చేయడంలేదు. గ్రామాల తరలింపు, స్థానికులకు ఉద్యోగాల కల్పనపై ఎమ్మెల్యేలు కనీస చొరవ తీసుకోవడంలేదని నిర్వాసితులు వాపోతున్నారు. నిర్వాసిత గ్రామాల తరలింపు, స్థానికులకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాల కల్పన జిఒ వంటి అమలుకాని అంశాలను సోమవారం పరవాడ, అచ్యుతాపురం వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసి వివరించాలని సిపిఎం నాయకులు చేసిన ప్రయత్నాలను ప్రభుత్వం అడ్డుకుంది. నాయకులను గృహ నిర్బంధం చేయించి, అరెస్టులు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లడంతో నిర్వాసితుల సమస్యల తీవ్రతను వెలుగులోకి రాకుండా చేసింది.

## విశాఖ పోర్టుతో పలు సంస్థలు ఎంఒయులు

డాక్టర్ ఎం.అంగముత్తు, డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా తరపున ఎంకె వాతోర్, జోనల్ ఆఫీసర్, వెస్ట్ జోన్, నేవీ తరపున అడ్మిరల్ నెల్సన్ డిసోజా సంతకాలు చేశారు.

**ట్రయాన్ సంస్థతో పోర్టు ఒప్పందం**

ట్రయాన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పోర్టుకు ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా పోర్టు శాలిగ్రామపురంలోని భూమిని ట్రయాన్ సంస్థకు దీర్ఘకాలిక లీజుకు ఇవ్వనుంది. ఒప్పందం విలువ 900 కోట్ల రూపాయలు. ఒప్పందంలో భాగంగా కన్వెన్షన్ సెంటర్లు, ఐటి టవర్లు నిర్మించనున్నారు. పోర్టు తరపున ఛైర్మన్ అంగముత్తు, ట్రయాన్ సంస్థ తరపున రజనీష్ మహాజన్, డైరెక్టర్లు సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

**ఆకట్టుకుంటున్న పోర్టు స్టాల్**

గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ - 2023లో భాగంగా విశాఖపట్నం పోర్టు ఏర్పాటు చేసిన స్టాల్ ఆహూతులను అమితంగా ఆకట్టుకుంటోంది. ప్రపంచ నలుమూలల నుంచి సమ్మిట్‌కు విచ్చేసిన ప్రతినిధులు విశాఖపట్నం పోర్టు స్టాల్‌ను సందర్శించి పోర్టు అధికారులతో సంప్రదింపులు జరిపారు. వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకునేందుకు విశాఖపట్నం పోర్టులో ఉన్న అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎపి ప్రభుత్వంతో కలిసి ప్రత్యేకంగా స్టేట్ సెషన్ నిర్వహించింది. ఈ సెషన్‌ను అంగముత్తు ప్రారంభించారు. ఎపి రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, పెట్టుబడులు వాణిజ్యం, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడారు.

## పకడ్బందీగా భారత్ - ఆసీస్ టి 20 మ్యాచ్

తెలిపారు. స్టేడియం సామర్థ్యం 27 వేల మందికే పరిమితం కావడంతో టికెట్ దొరక్కపోవడంతో మ్యాచ్‌ను తిలకించలేని క్రికెట్ అభిమానులు నిరుత్సాహపడకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాదాపు పది వేల మంది మ్యాచ్‌ను చూసేందుకు ఆర్‌కె బీచ్‌లో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసేందుకు అపెక్స్ కౌన్సిల్ ఆలోచిస్తోందన్నారు. విశాఖలో 40 వేల పైచిలుకు మంది పట్టేలా మరో అంతర్జాతీయ స్టేడియం నిర్మాణానికి కసరత్తు ప్రారంభించామన్నారు. నిర్వహణ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ టికెట్ల అమ్మకాల వద్ద రెవెన్యూ అధికారిని నియమించి విక్రయాలు సజావుగా సాగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ ఛైర్మన్ పృధ్వీతేజ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతూ మాట్లాడుతున్న అనిత

## జగన్ టీంలో అందరూ సైకోలే

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి. జగన్మోహన్ రెడ్డి టీంలోని వారందరూ సైకోలేనని తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ సైకోలా ప్రవర్తిస్తున్నారని, మంత్రులు కూడా సైకోలుగా మారిపోయారన్నారు. 37 రోజులుగా చంద్రబాబును జైల్లో పెట్టి హింసిస్తున్నారని తెలిపారు. సజ్జల, డిప్యూటీ సిఎం నారాయణ స్వామి భువనేశ్వరిపై పిచ్చి కూతలు కూస్తున్నారని తెలిపారు.

# ఇజ్రాయిల్ దాడిని ఖండించండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న సైనిక దిగ్బంధనాన్ని తక్షణమే విరమించాలని, ఐక్యరాజ్య సమితి తీర్మానాల ప్రకారం పాలస్తీనా భూభాగాల నుంచి వెంటనే ఇజ్రాయిల్ వైదొలగాలని విశాఖ పౌర ప్రజా సంఘాలు, భారత బచావో కమిటీలు కోరాయి. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆయా సంఘాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు విఎస్.కృష్ణ, భారత బచావో విశాఖ జిల్లా నాయకులు పి.చంద్రశేఖర్, పౌర ప్రజా సంఘాల వేదిక నాయకులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బడా కార్పొరేట్ కంపెనీలు, సామ్రాజ్యవాద శక్తులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సహజ వనరులను, మానవ శ్రమను, వినియోగదారుల మార్కెట్లను కొల్లగొట్టే లక్ష్యంతో ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలకు తెరలేపుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పైడిరాజు, టి.శ్రీరామమూర్తి, ఎస్‌కె.రెహమాన్, వై.నూకరాజు, ఎస్.వెంకటలక్ష్మి, జి.సీతామహాలక్ష్మి, వేమన శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వర్లు, కె.మల్లయ్య, యు.నిర్మల, సలీం, పుష్ప, డి.వెంకట్రావు, సృజన పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

## 19, 20 తేదీల్లో యుటిఎఫ్ నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జిపిఎస్‌ను రద్దుపరిచి ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఈ నెల 18 నుంచి నిరవధిక దీక్షలు ప్రారంభం అవుతున్నాయని, అందులో భాగంగా 19న విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్ష, 20న తాలుకా, డివిజన్ కేంద్రాలలో నిరాహార దీక్షలు జరుగుతాయని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు టిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బాదంతో ప్రోటీన్ సమస్యలకు చెక్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : శరీరం సక్రమంగా నడవాలంటే తీసుకునే ఆహార పదార్థాలలో ప్రోటీన్లు తప్పనిసరిగా ఉండాలని, అటువంటి ప్రోటీన్ సమస్యను నిత్యం గుప్పెడు బాదం తీసుకోవడం ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణ స్వామి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా ఆధ్వర్యంలో 'భారతదేశంలో ప్రోటీన్ సమస్య - సహజ దృక్పథం' అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ భారతీయులలో 73 శాతం మంది సరిపడినంత ప్రోటీన్ తీసుకోవడం లేదని ఓ సర్వేలో తేలిందన్నారు. 90 శాతం మందికి దీని ఆవశ్యకతపై అవగాహన లేదన్నారు. బాదం చేసే మేలును వివరించారు. కార్యక్రమంలో సెలబ్రిటీ, ఫిటెనెస్ కోచ్ సుచేతా పాల్ పాల్గొన్నారు.

## వివేకానంద సంస్థ పనితీరు అభినందనీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతి సంవత్సరం తమ ఆశ్రమవాసులకు బంగారాన్ని కొనడం, వృద్ధులను తల్లిదండ్రులు వలే చూసు కోవడం వంటి చర్యలు చేపడుతున్న శ్రీ వివేకానంద సంస్థ నిర్వాహకులు అభినందనీయులని దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. చిలకపేటలో ఉన్న శ్రీ స్వామి వివేకానంద ఆశ్రమ వాసులకు సమకూర్చిన బంగారు వస్తువులను దసరా సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో యువ నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ, కనకమహాలక్ష్మి దేవస్థానం ఛైర్మన్ కొల్లి సింహాచలం, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్, సౌత్ ముస్లిం మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్ ఖాన్, మాజీ కార్పొరేటర్ పిల్లి రమణ, బాబ్జీ, ఎర్రబిల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

బంగారు వస్తువులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

## తెలంగాణ తరహా పథకాలు అమలుచేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న, అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు జెటి.రామారావు, తలారి సురేష్, మద్యారెడ్డి సురేష్, కరణం రామ్మోహన్ నాయుడు, బత్తుల నీలకంఠం, ఆర్.తాతారావు కోరారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఏపిలో రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తమ పార్టీ పోటీ చేయనుందన్నారు. ఏపిలో పాలకులు అప్పులతో పాలన నడిపిస్తున్నారని, తాము అధికారంలోకొస్తే మిగులు బడ్జెట్ ఉండేలా చూస్తామని అన్నారు.

## ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవంపై బివి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మొనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థలు రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం ఎంవిపి కాలనీలోగల ఎస్-ఎస్‌విపి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు, బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నరవ ప్రకాశరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పారావు, పి.రాధారాణి, హేమలత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## చంద్రబాబుకు ఆసుపత్రిలో వైద్యం అందించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన ఉన్నందున ఆయనకు మిలటరీ ఆసుపత్రిలో వైద్యం అందించాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్ కోరారు. మంగళవారం ఢిల్లీ వెళ్లిన ఆయన రాష్ట్రపతి కార్యాలయంలో ఈ మేరకు లేఖ అందజేశారు. అనంతరం వైసిపి ఎంపీ రఘు రామకృష్ణరాజును కలిశారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు.

**పబ్లిక్ నోటీసు**

Under the instruction of Our Client, **Sri KARRI SIVA,** S/o. K.Satyanarayana, Resident of S.Annavaram, Tuni Mandal, Kakinda District issuing the following notice

మా క్లయింట్ పోగొట్టుకున్నది (1) 15-10-2021 తేదీన రిజిష్టర్ చేయబడిన వీలునామా, S.R.O.కోటవురట్ల యొక్క 59/2021 పత్రాన్ని కలిగి ఉంది మరియు (2) 03-03-2014 నాటి రిజిష్టర్ సేల్ డీడీ, S.R.O. కోటవురట్ల యొక్క 962/2014 డాక్యుమెంట్ నెం. 962/2014. అదే జాడ కోసం ఉత్తమ ప్రయత్నాలు, అది కనుగొనబడలేదు. దీంతో మా క్లయింట్ కోటవురట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు అన్‌ట్రేసబుల్ సర్టిఫికేట్ ఇచ్చారు. ఎవరైనా పేర్కొన్న పత్రాలను కనుగొంటే, దయచేసి మా క్లయింట్‌కు లేదా క్రింది చిరునామాకు తిరిగి పంపండి.

S.K. మదీన వల్లి
ఫాతిమున్నిషా
న్యాయవాదులు,
డో.నెం. 45-2-60/58/2,
రామచంద్రనగర్, విశాఖపట్నం-16.
సెల్: 94405 30405

### విద్యుదాఘాతానికి గురైన

# విష్ణుకు న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-పద్మనాభం : విద్యుదాఘాతానికి గురైన మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధి గొల్లలపాలెం గ్రామానికి చెందిన లైన్‌మ్యాన్ హెల్పర్ దువ్వువిష్ణుకు న్యాయం చేయాలని గ్రామస్తులు మంగళవారం సబ్‌స్టేషన్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 14న విష్ణుకు లైన్‌మ్యాన్ రాధాకృష్ణ ఫోన్ చేసి కోళ్ల ఫారం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పైన వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ లైన్ సరిచేయాలని చెప్పారని తెలిపారు. ఆ సమయంలో ఎల్‌సి తీసుకోకుండా లైన్‌మ్యాన్ పని చేయించడంతో విష్ణు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడని గ్రామస్తులు ఆరోపించారు. అప్పటి నుంచి లైన్‌మ్యాన్ పరారీలో ఉన్నాడని, నాలుగు రోజులు అవుతున్నా ఆయన విద్యుత్ శాఖాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సబ్ స్టేషన్‌లో ఉన్న సబ్ ఇంజినీర్ రమేష్ మాట్లాడుతూ, లైన్‌మ్యాన్‌ను విధుల నుంచి తొలగించామని, ఆయనపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుచేశామని వివరించారు. విష్ణు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్‌చేశారు. లేకుంటే ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి.పెద్దఎర్రినాయుడు, రవి, సత్యనారాయణ, చంద్రరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ప్రాంగణంలో ధర్నా చేస్తున్న గొల్లలపాలెం గ్రామస్తులు

## 'క్యాబ్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు'

ప్రజాశక్తి - ఆరిలోవ : మ్యాక్స్ క్యాబ్ డ్రైవర్లకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.రెహ్మాన్, అధ్యక్షులు కాసుబాబు డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం ముడసర్లోవ పార్కు వద్ద జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెహ్మాన్, కాసుబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జిఒ 21, 31లను తెచ్చి ఆటో కార్మికులపై మోయలేని ఆర్థిక భారాలు వేస్తున్నారన్నారు. ఈ చలానా కేసులను ఎత్తి వేయాలని, ఆటో కార్మికులు ప్రమాదంలో మృతి చెందితే డ్రైవర్ కుటుంబానికి రూ.10 లక్షలు, సహజ మరణం చెందితే రూ.5 లక్షలు వచ్చేలా బీమా పాలసీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు చిన్ని, పాండు పాల్గొన్నారు.

## కెజిబివిని డిఇఒ సందర్శన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కెజిబివి) డిఇఒ ఎల్.చంద్రకళ సందర్శించారు. ఇంటర్ విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. సమయం చాలా విలువైనదని, దసరా సెలవులను సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ జిల్లా అధికారి, పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

## ఎన్‌ఎపి 33వ వార్షిక సమావేశాలు

ప్రజాశక్తి-మధురవాడ :గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నేషనల్ అకాడమి ఆఫ్ సైకాలజీ (ఎన్‌ఎపి) 33వ వార్షిక సమావేశాలను 2024 ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ చిన్నయ సూరి తెలిపారు. సమాజ సుస్థిర అభివృద్ధిలో మానసిక అంశాల పాత్రపై పరిశోధకులు ఈ సమావేశాలలో చర్చలు జరుపుతారని పేర్కొన్నారు. డెవలప్‌మెంటల్ సైకాలజీ, సోషల్, కాగ్నిటివ్ సైకాలజీ, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇండియన్ సైకాలజీ, క్లినికల్, హెల్త్, మిలటరీ, జెరోసైకాలజీ, సైబర్ సైకాలజీ అంశాలలో పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను నవంబర్ 15వ తేదీలోగా పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమావేశాలకు ముందుగా వర్క్‌షాప్‌లను నిర్వహించదలచిన వారు వివరాలను 33naop@gitam. edu మెయిల్‌కు పంపాలని సూచించారు. ఈ సమావేశాలలో పాల్గొన దలచినవారు ఈ ఏడాది డిసెంబర్ 28వ తేదీలోగా వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం సమావేశాలు వెబ్‌సైట్ naop33.gitam.edu. పరిశీలించాల్సిందిగా సూచించారు.

# 27న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రదర్శన

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 27వ తేదీన ప్రదర్శిస్తామని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్థానిక ఆర్‌డిఒ ఎస్‌భాస్కరరెడ్డి చెప్పారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులకు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్ళు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్ల నమోదు నిమిత్తం ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డిటి జె.భాస్కరరావు, వైసిపి నుంచి ఎస్.కరుణాకరరెడ్డి, జేరు వెంకటరెడ్డి, టిడిపి నుంచి డిఎఎన్.రాజు, గంటా నూకరాజు, జనసేన నుంచి ఇఎన్‌ఎస్.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# 175 పశువులకు గర్భకోశ చికిత్సలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బోని గ్రామంలో మంగళవారం మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. భారత ప్రభుత్వ పశుధన్ జాగ్రతి అభియాన్ కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన పశు వైద్య చికిత్సా శిబిరం, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 175 పశువులకు గర్భ కోశ వ్యాధి చికిత్స ఆపరేషన్లు, 2 పశువులకు హెర్నియా ఆపరేషన్లు, 7 పశువులకు మైనర్ సర్జరీలు నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు, డీటికింగ్ మందులు వేశారు. పశు యాజమాన్యలకు ప్రత్యేకంగా మినరల్ మిక్చర్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుల సందేహాలను నివృత్తిచేశారు. అనంతరం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.కరుణాకరరావు మాట్లాడుతూ, పాడి పశువుల ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. గ్రామాలలో గోపాల మిత్రులు, పశు వైద్యాధికారుల సేవలను వినియోగించుకొని పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలని సూచించారు. చిన్నగదిలి ఎడి డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకులు మజ్జి వెంకటరావు, బోని అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ అప్పలకొండ సన్యాసినాయుడు, ఎంపిటిసి సభ్యులు బోని పార్వతి, డాక్టర్ శ్రీకళ, డాక్టర్ రవికుమార్, ఎడిడిఎల్.మోహిని, గోపాలమిత్రులు భాస్కరరావు, ఈశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆనందపురం పంచాయతీ బోర్డు తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం గ్రామ పంచాయతీ బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారని, దీనిపై విచారణ చేపట్టాలని ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆనందపురం సంతోషిమాత ఆర్చ్ జయరాం కోళ్ళ ఫారం మధ్యలో నమస్తే ఆనందపురం బోర్డు గతంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆనందపురం రెవెన్యూ పరిధిలో ఉన్న లోడగలవానిపాలెం గ్రామపంచాయతీ విడిపోయిన తర్వాత 1996లో సంతోష్ మాత ఆర్చి, జయరామ్ కోళ్లఫారం మధ్యలో నమస్తే ఆనందపురం బోర్డును ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు బోర్డును తొలగించారని తెలిపారు. బోర్డు తొలగించడంతో ఆనందపురం గ్రామపంచాయతీ సరిహద్దులో గందరగోళ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కొంతమంది సరిహద్దుల విషయంలో గందరగోళం కల్పించే ఉద్దేశంతో ఈ బోర్డును తొలగించి ఆనందపురం, లోడగలపాలెం మధ్య వివాదాలు తలెత్తేలా చర్యలు చేపడుతున్నారని అనుమానం వ్యక్తంచేశారు. దీనిపై విచారణ జరిపి బోర్డు తొలగించిన వారిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# విద్యుత్ వైర్లకు దొండ పాదు

విద్యుత్ వైర్లను చుట్టేసిన దొండ పాదు

దొండ పాదు తొలగించిన విద్యుత్ లైన్

### ఫిర్యాదు చేసిన వెంటనే తొలగింపు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు తగరపువలస కొత్తపేట జ్యూట్ కార్మికవాడను ఆనుకుని ఉన్న ఓ విద్యుత్ స్తంభం వైర్లకు దొండ పాదు చుట్టేయడంతో కొన్ని ఇళ్లకు సరఫరాలో తలెత్తిన ఇబ్బందులను స్థానికులు ఎఇ బొట్ట రవి దృష్టికి మంగళవారం తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించారు. ఫిర్యాదు అందిన కొద్ది సేపటికే సిబ్బందిని పంపించి వైర్లకు చుట్టేసిన దొండ పాదును తొలగించారు.

## నేరాలు ఘోరాలు

### ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -గోపాలపట్నం : ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన భగత్‌సింగ్‌నగర్ జంక్షన్లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... దేవ్ సతీష్‌కుమార్ (35) కార్పెంటర్ పనులు చేసుకుంటూ 89 వార్డు పరిధి ఆదర్శనగర్‌లో నివాసముంటున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో పని నిమిత్తం భగత్‌సింగ్‌నగర్ మీదుగా వెళ్తున్నాడు. అదే సమయంలో భవన నిర్మాణ వ్యర్థాలతో ఒక ట్రాక్టర్ వెనుకనే వెళ్తోంది. భగత్‌సింగ్‌నగర్ జంక్షన్ దాటిన తర్వాత ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో సతీష్ కుమార్ ట్రాక్టర్ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, స్థానిక నాయకులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

### గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ: రోడ్డు ప్రమాదంలో ఈ నెల 15వ తేదీన గాయపడిన వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... జివిఎంసి ఆరో వార్డు పరిధి బక్కన్నపాలేనికి చెందిన పి.గోపి (58) ఓ ప్రైవేట్ సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన ద్విచక్ర వాహనంపై ఆనందపురం వైపు వెళుతుండగా మారికవలస వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకున్నాయి. గోపి కింద పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు హెచ్‌సి శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అప్పన్న హుండీ ఆదాయం రూ.1.10 కోట్లు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నకు హుండీ ద్వారా భక్తులు 20 రోజులకు సమర్పించిన కానుకలను మంగళవారం దేవస్థానం ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో లెక్కించారు. నగదు రూ.1,10,29,970, బంగారం 5 గ్రాములు, వెండి 7 కేజీల 50 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సహాయ కార్య నిర్వహణాధికారులు రమణమూర్తి, నరసింహవర్మ, డి.భ్రమరాంబ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. లెక్కింపు సమయంలో ట్రస్టు బోర్డు సభ్యులు దొడ్డి రమణ నిబంధనలకు విరుద్ధంగా చొక్కాతో రావడం కనిపించింది.

## 20న పద్మనాభం మండల సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 20వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

## టెన్నిస్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస ఎన్నారై వైద్య విద్యా సంస్థ విద్యార్థినిలకు టెన్నిస్‌లో రెండు బంగారు పతకాలు లభించాయి. డాక్టర్ వైఎస్ఆర్ వైద్య విశ్వ విద్యాలయం 23వ వార్షిక అంతర్ కళాశాల మహిళల ఆటల పోటీల్లో స్థానిక సంగివలస ఎన్నారై వైద్య విద్యా సంస్థ విద్యార్థినిలు బిఎల్ఎస్.రితిక వ్యక్తి గత టెన్నిస్ పోటీలో బంగారు పతకం సాధించగా, యశస్వినితో జంటగా డబుల్స్‌లో కూడా బంగారు పతకం సాధించింట్లు ఎన్నారై వైద్య విద్యా సంస్థ డీన్ డాక్టర్ పివి.సుధాకర్, సిఇఒ నిరంజన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కార్యాలయాధికారి శివ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను మంగళవారం కళాశాలలో అభినందించారు.

బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న డీన్ సుధాకర్ తదితరులు

## బాలికను గర్భవతిని చేసిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-లీగల్ : ప్రేమ, పెళ్లి పేరుతో బాలికను గర్భవతిని చేసి, ఆమెకు కుమారుడు కలగడానికి కారకుడైన వ్యక్తికి 25 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధిత బాలికకు ప్రభుత్వం తరపున రూ.7 లక్షలు ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాల ప్రకారం... ఉమ్మడి విశాఖ జిల్లా ప్రస్తుతం ఎఎస్ఆర్ జిల్లా చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ పరిధిలోని తోటరాజు బంద గ్రామానికి చెందిన నిందితుడు జాత రాంబాబు (21) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. పేదలపుట్టు గ్రామానికి చెందిన బాధితురాలు (15)కు రాంబాబుతో పరిచయం ఏర్పడింది. బాలికకు మాయ మాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఒక మగ బిడ్డకు జన్మనిచ్చింది. బాలిక గర్భం దాల్చడానికి తాను కారణం కాదని వేరే వ్యక్తితో ఆమె సంబంధం ఉందంటూ రాంబాబు తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో 2018 ఫిబ్రవరి 14వ తేదీన బాలిక చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు ప్రాథమిక విచారణ చేసి నిందితునిపై సెక్షన్376(1), ఫోక్సో చట్టం సెక్షన్ 5(1) కింద కేసు నమోదుచేసి నేరాభియోగ పత్రాన్ని కోర్టులో దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

## అభివృద్ధి పనులకు పెద్ద పీట

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చెప్పారు. జివిఎంసి 72వ వార్డు పరిధిలో రూ.74.80 లక్షలతో అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మౌలిక సౌకర్యాలైన రోడ్లు, డ్రైనేజీలకు నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి సిరట్ల వాసు, సిపిఎ నాయకులు జి.ఆనంద్, వార్డు పెద్దలు వీరయ్య, రామిరెడ్డి, పరశురామ్, ప్రభుకుమార్, డిఇ మణి కుమార్, ఎఇ భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## నేత్ర పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి -ములగాడ : మనిషికి కళ్లు ప్రధానమైనవని, వాటిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎన్‌జె.శిరీష సూచించారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం, ఐక్యుఎసి ఆధ్వర్యాన నిర్వహించిన రెండు రోజుల ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరంలో ఆమె మాట్లాడారు. కంటి విషయంలో సొంత వైద్యం పనికి రాదని, డాక్టర్ల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ, డాక్టర్ శిరీష తమ కళాశాల పూర్వ విద్యార్థిని కావడం తమకు ఎంతో గర్వకారణం అన్నారు. అనంతరం సుమారు 1000 మంది విద్యార్థినులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ సిబ్బంది బి.నవీన్‌కుమార్, ప్రసన్న, తేజ, స్వరూప, వసుధ, మాధురి, ఆశ్వ, శ్రావణి తదితరులు సేవలందించారు.

## పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి- ములగాడ : పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన మల్కాపురం విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు మాట్లాడుతూ, ట్రుఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయన్నారు. కార్పొరేట్ల దోపిడీ ఆపితే, ప్రభుత్వాల అవినీతిని అరికడితే సామాన్యులపై భారాలు వేయాల్సిన అవసరముండదన్నారు. రాజకీయ అవినీతిపరులు, కార్పొరేట్లు, పాలకులు కుమ్మక్కై రూ.2, రూ.3 కొనాల్సిన విద్యుత్తును బహిరంగంగా మార్కెట్లో రూ.10 నుంచి రూ.20కి కొంటున్నారని, ఇందులో భారీ ఎత్తున అవినీతి ఉందని, ప్రజలు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నూనెల సూరిబాబు, గండి అప్పారావు, డి.గోపాలరావు, బి.వెంకట్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ధర్నా

ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి -ములగాడ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై విశాఖ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన 59వ వార్డు పరిధి నెహ్రూనగర్ లేబర్ జంక్షన్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మల్కాపురం జోన్ గౌరవాధ్యక్షులు కె.పెంటారావు మాట్లాడుతూ, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు సుమారు రూ.850 కోట్లను ఇతర పథకాలకు మళ్లించి భవననిర్మాణ కార్మికులకు అన్యాయం చేశారన్నారు. అధికారం చేపట్టి నాలుగేళ్లు దాటినా భవన నిర్మాణ కార్మికుల ప్రసూతి, వివాహ, మృతిచెందిన వారికి క్లెయిములు మంజూరు చేయకుండా ఏగనామం పెట్టారని విమర్శించారు. సంక్షేమ బోర్డులో రూ.వేల కోట్లు ఉన్నా భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అందటం లేదన్నారు. కరోనా కాలంలో సంక్షేమ బోర్డు లేబరు కార్డు ఉన్న ప్రతి భవననిర్మాణ కార్మికునికి రూ.10 వేలు చొప్పున సహాయం చేస్తానని చెప్పి విస్మరించారన్నారు. కార్డు ఉండి 60 సంవత్సరాలు దాటిన కార్మికులందరికీ ప్రతి నెలా రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, వై.గంగాధర్, పైడినాయుడు, రాజు, సత్యం, రాజేష్, ఈశ్వరరావు, కుమార్, శ్రీను, సురేష్, సత్యం పాల్గొన్నారు.

# అర్థాంతరంగా ముగిసిన 'ఉక్కు' బోనస్ చర్చలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లింపు కోసం ఢిల్లీలో ఏర్పాటుచేసిన సమావేశం అర్థాంతరంగా ముగిసిందని సిఐటియు ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యారామ్ తెలిపారు. కేవలం రూ.23 వేలు మాత్రమే చెల్లిస్తామని యాజమాన్యం పట్టుబట్టడంతో కార్మిక సంఘాలు ఐక్యంగా దీన్ని తిరస్కరించాయని తెలిపారు. గతం కంటే ఎక్కువ బోనస్ ఇప్పించాలని కార్మిక సంఘాలన్నీ పట్టుబట్టాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కులో నూతన వేతన ఒప్పందం లేక యువ కార్మికులు, సీనియర్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి సమయంలో బోనస్ ఆశలపై నీళ్లు చల్లడం సరైన పద్ధతి కాదన్నారు. పోరాటం చేయకుండా చర్చలతోనే పరిష్కారం కావాలని ప్రయత్నిస్తే ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల బోనస్ కోసం పోరాటం తప్పదని, కార్మిక సంఘాలన్నీ ఈ పోరాటానికి సహకరించాలని కోరారు.

# ఘనంగా పద్మపూజిత వీ'స్‌మార్ట్ వార్షికోత్సవం

వార్షికోత్సవంలో పాల్గొన్న వీ'స్ మార్ట్ అధినేత బసవరాజు, సిబ్బంది

ప్రజాశక్తి-సీతమ్మధార : పద్మ పూజిత వీ'స్ మార్ట్ 21వ వార్షికోత్సవాన్ని దొండపర్తిలో గల సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ పూజిత వీ'స్ మార్ట్ అధినేత బసవరాజు మాట్లాడుతూ, సంస్థ ఎదుగుదలలో సిబ్బంది కృషి మరువలేనిదన్నారు. ప్రజల ఆదరాభిమానాలతో 21 సంవత్సరాల సంబరాలు ఘనంగా జరుపుకుంటున్నామని చెప్పారు. తమను ఆదరిస్తున్న ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. సంస్థలో వచ్చిన లాభం పేద విద్యార్థుల చదువు నిమిత్తం ఖర్చు పెడుతున్నామని తెలిపారు. అందులో భాగంగానే సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలకు ఏటా మెరిట్ స్కాలర్‌షిప్పు అందిస్తున్నట్లు చెప్పారు. పద్మ పూజిత వీ'స్ మార్ట్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విస్తరింపజేసిన ప్రజలకు, పనిచేస్తున్న సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సాయిబాబు, త్రినాథ్, వేణు, వీరేంద్ర, మదన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జివిఎంసి కమిషనర్ కృషికి ప్రశంసలు

ప్రజాశక్తి-సీతమ్మధార : శిథిలావస్థకు చేరిన తాటిచెట్లపాలెం వాసుదేవనగర్ మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థుల సమస్యను పరిష్కరించడంలో జివిఎంసి కమిషనర్ చూపిన చొరవను బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ప్రశంసించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో ఆయనను మంగళవారం కలిసి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తరపున ప్రశంసా పత్రాన్ని అందించారు. వాసుదేవనగర్ మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్ శిథిలావస్థ సమస్యను ఈ ఏడాది జూన్‌లో సీతారాం దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకొచ్చారు. దీంతో ఆయన పాఠశాలను సందర్శించి నివేదిక రూపంలో జివిఎంసి సాయి శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లి స్కూల్‌ను వేరే భవనంలోకి మార్పు చేయాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ మునిసిపల్ అధికారుల నుంచి నివేదిక తెప్పించుకొని యుద్ధ ప్రాతిపదికన నూతన భవనంలోకి ఆగస్టు 7వ తేదీన తరలించారు. దీనిపై కమిషనర్‌ను బాలల హక్కుల కమిషనర్ తరుపున సీతారాం ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వివి.వామనరావు, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ నగర కన్వీనర్ కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - యంత్రాంగం :

**ఆరిలోవ:** జివిఎంసి 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వైసిపి తూర్పు సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ కెల్ల సత్యనారాయణ, వైసిపి నాయకులు కాకర గోవిందు, వంకర బాబూరావు, వెంకటరెడ్డి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

**సీతమ్మధార :** 26వ వార్డు పరిధి పువ్వులవారివీధి, అక్కయ్యపాలెం ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కెె.రాజు, 26వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, నాయకులు ఆళ్ల శివగణేష్, బులుసు జగదీష్, రాయుడు శ్రీను, బొడ్డేటి కిరణ్, రవిబాబు, నవాబ్, శేషు పాల్గొన్నారు.

## 'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెె.రాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## లఘు చిత్ర ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో రెండు రోజుల లఘు చిత్రాల ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఎన్ఎడి పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, దేశ విదేశాలలో అవార్డులు పొందిన లఘు చిత్రాలను ఉచితంగా ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, బి.చిన్నారావు, మహమ్మద్ హుస్సేన్, ఛాట్ల బాబూరావు, డాక్టర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. బుధవారం కూడా ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -మాధవధార : జివిఎంసి 48వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లో సిసి రోడ్లు, మెట్లు, డ్రైన్ల నిర్మాణాలకు వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెె.రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కెె.రాజు మాట్లాడుతూ, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. రూ.20 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంకల కవిత, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, నాయకులు కర్రి రామారెడ్డి, గంగరాజు, సత్యనారాయణ రెడ్డి, భూలోక, పద్మ, శంకరరావు, కుమార్, కోటి, రాజు సింగ్, భారత్, హసీనా, భవ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక భవనాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : 55వ వార్డు పరిధి ధర్మానగర్ ప్రాంతంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు సామాజిక భవనాల కోసం కార్పొరేటర్ కెవిఎన్.శశికళ ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెె.రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. ధర్మానగర్ ఆశీర్వాద్ కల్యాణ మండపం వేనుక ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కెె.రాజు మాట్లాడుతూ, స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు సామాజిక భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, సేనాపతి అప్పారావు, డిఇ భరణి, నాయకులు కెపి.రత్నాకర్, వి.అప్పారావు పాల్గొన్నారు.

## క్యాంపస్ డ్రైవ్‌లో 43 మంది ఎంపిక

ప్రజాశక్తి -మాధవధార : మేజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మాధవధారలోని శ్రీపాద డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 43 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డి.రాజేష్ తెలిపారు. సీల్ హెచ్ఆర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఐ స్మార్ట్ సొల్యూషన్స్, మిత్సుబిషి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అగ్రో టెక్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, పేటీఎం, రేస్ సర్వే ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనగా 102 మంది రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. వారిలో 43 మంది ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.కార్తీక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వ్యర్థాల నిర్వహణపై అవగాహన

### పిసిబి చైర్మన్ సమీర్ శర్మ

మాట్లాడుతున్న పిసిబి చైర్మన్ సమీర్ శర్మ

**ప్రజాశక్తి- అనకాపల్లి:** వ్యర్థాల నిర్వహణతో మాత్రమే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని కాలుష్య నియంత్రణ సంస్థ (పిసిబి) చైర్మన్ సమీర్ శర్మ అన్నారు.. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యంగా రసాయనిక, ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణ పూర్తి అవగాహనతో చేపట్టాలన్నారు. ఘన, ద్రవ, రసాయన, ప్లాస్టిక్ వ్యర్థాలను మొదట్లోనే వేరు చేయాలని, ఆసుపత్రులు, లేబరేటరీల వ్యర్థాలను వేరు చేయడంలో జాగ్రత్త వహించాలన్నారు. సీసాలు, సిరంజీలు, రసాయన బ్యాగులు, ప్లాస్టిక్‌లను విడదీసి వాటిలో ఉన్న ప్రమాదకర రసాయనాలను ధ్వంసం చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే విధంగా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. వ్యర్థాలను విడదీసే ప్రదేశాలైన ఆసుపత్రులు, మందుల షాపులు, లేబరేటరీలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ జిల్లాలో వ్యర్థాల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో వ్యర్థాల నిర్వహణపై డిఎంహెచ్ఒ డాక్టర్ ఎ.హేమంత్ వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్వరణ్ రాజ్, పిసిబి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎన్ఇపితో పేదలకు విద్య దూరం

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర బాలికల కన్వీనర్ పావని

**ప్రజాశక్తి-అనకాపల్లి** :నూతన విద్యావిధానంలో పేదలకు చదువు దూరమయ్యే పరిస్థితి ఎదురుకానుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పావని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో నూతన విద్యా విధానం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ఈ విధానంతో భవిష్యత్తులో వెనకబడిన వర్గాలకు, పేదలకు విద్య అందని ద్రాక్షగా మారుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మామిడి రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ ఎస్ రమణ, ట్రెజరర్ గొర్లి తరుణ్ జిల్లా నాయకులు గీతాకష్ణ తదితర ఎస్ఎఫ్ఐ బందం, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు.

## విద్యుత్ భారంపై ఉద్యమమే శరణ్యం

**ప్రజాశక్తి- దేవరాపల్లి :** ఇబ్బడిముబ్బడిగా పెంచేసిన విద్యుత్ ఛార్జీల భారంపై వినియోగదారులు మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని మాటిచ్చిన సిఎం జగన్, నాలుగేళ్లలో ఏడుసార్లు ఛార్జీలను పెంచడంతోపాటు ఇపుడో పద్దేళ్ల క్రితం వాడిన కరెంటుకు తాజాగా సర్దుబాటు, సర్‌ఛార్జీల పేరుతో ఇపుడు వినియోగదారుల నుంచి వసూలు చేయడం దుర్మార్గమన్నారు. గతేడాది రూ.1400 కోట్ల విద్యుత్ ఛార్జీల భారం వేసిన సిఎం జగన్, సర్దుబాటు ఛార్జీల పేరుతో మరో రూ. ఆరువేల కోట్ల భారం వేశారని, నాలుగేళ్లలో రూ.25వేల కోట్ల కరెంట్ ఛార్జీల భారాన్ని ప్రజల నెత్తిన మోపారన్నారు. కేంద్ర విద్యుత్ సంస్కరణలను తుచ తప్పకుండా అమలు చేస్తూ స్మార్ట్‌మీటర్ల భారం వేస్తున్నారని మండిపడ్డారు..కార్పొరేట్ల దోపిడి, ప్రభుత్వాల అవినీతిని అరికడితే కరెంటుఛార్జీలు పెంచకుండా, ఎలా తగ్గించచ్చో విద్యుత్ నియంత్రణ మండలిలో సిపిఎం, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు పలుసార్లు రాతపూర్వకంగా వివరించినాప్రభుత్వాలకు పట్టకపోవడం శోచనీయమన్నారు.

# ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

### సంసద్ ఆదర్శ్ గ్రామీణ యోజనపై సమీక్షలో ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి

సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

**ప్రజాశక్తి- అనకాపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతులను కల్పించడం, విద్యుత్తు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, ప్రజల ఆరోగ్యం, వివిధ రంగాల అభివృద్ధితో పాటు అందరికీ సంపాదన, ఉద్యోగభద్రత, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఆరోగ్యశ్రీ సంపూర్ణ బీమా కార్డులు, పింఛన్లు మొదలైనవి కల్పించాలన్నారు. అదేవిధంగా మూర్తిమత్వ వికాసం, ఆరోగ్యం, విద్య, సామాజికాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి, పరిశ్రమల స్థాపన పర్యావరణ రక్షణకు చెట్లను నాటడం, అడవుల పెంపకం ఇవన్నీ చేపట్టి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే వివిధ రకాల నిధులను ఉపయోగించి గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నిధులను బట్టి అవసరమైన ప్రణాళికలను రూపొందించడం, వాటిని అమలు చేయడం చేయాలన్నారు. వివిధ శాఖల సమన్వయంతో అన్ని రంగాలలో గ్రామాన్ని అభివృద్ధి చేసి, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చేందుకు పాటుపడాలన్నారు.

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ వివిధ గ్రాంట్లతో చేపట్టే పనులు ప్రణాళికాయుతంగా రూపొందించుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన వాటిపై తగిన దృష్టి కేంద్రీకరించాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో ఆయన వివిధ మండలాలలో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్షించారు. జిల్లా పరిషత్తు సిఇఒ శ్రీరామమూర్తి, సిపిఒ జి. రామారావు, జిల్లా పరిషత్ ఇఇ వీరన్నాయుడు, జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, డిపిఒ శిరీష రాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ నాగేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎ.హేమంత్, ఆర్అండ్‌బి ఇఇ రమేష్, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, డిఇఒ వెంకట లక్ష్మమ్మ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నిర్బంధాలతో ఎన్నాళ్లీ మనుగడ!

### సిఎం జగన్, వైసిపికి ఇవే చివరి ఎన్నికలు : బుద్ధ నాగజగదీష్

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు నాగ జగదీష్

**ప్రజాశక్తి -అనకాపల్లి :** ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పర్యటనకు వస్తే, ప్రజల కష్టాలు తీరాల్సింది పోయి, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలతో కొత్తకష్టాలు సృష్టించడం పరిపాటిగా మారిందని, తాజాగా విశాఖ అనకాపల్లి పర్యటనల్లో పోలీసులు మరోమారు దాన్ని రుజువు చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు మండిపడ్డారు. మంగళవారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి తన విలాసవంతమైన భవనానికి పూజలు చేయడానికి, ఇన్ఫోసిస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసి, ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని చెప్పడం చూస్తుంటే జగన్‌కు మతిభ్రమించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఇక నేడు రేపు అంటూ ఎన్నో సార్లు వాయిదా పడిన విశాఖ పాలనారాజధాని నిజంగా సాకారమైతే, శాంతిభద్రతల పేరుతో ఇక ఉత్తరాంధ్ర ప్రజలను రోడ్డుమీద నడవకుండా, ప్రతిపక్ష పార్టీలను గృహాలకే పరిమితం చేసేలా పోలీసుల వ్యవహరిస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. అభివృద్ధి చేయడం చేతకాని ముఖ్యమంత్రి జగన్, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. తెలుగుదేశం జనసేన కూటమిని చూసి ఓడిపోతానే మోనన్న భయం ముఖ్యమంత్రి జగన్‌కు, వైసిపి నేతలకు పట్టుకుందని, రానున్న ఎన్నికల్లో అది జరిగి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. సిఎం జగన్‌కు, వైసిపికి ఇవే చివరి ఎన్నికలని జోస్యం చెప్పారు. సమావేశంలో పార్లమెంటు ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కెకెవిఎ.నారాయణరావు పాల్గొన్నారు.

# ఆహ్వాన నాటికోత్సవాలకు అపూర్వ స్పందన

కన్నీటి కథ నాటికలో ఒక సన్నివేశం

**ప్రజాశక్తి -అనకాపల్లి :** గవరపాలెం కనకదుర్గమ్మ ఆలయం ఆధ్వర్యంలో శ్రీగౌరీ సేవా సంఘం, మళ్ల జగన్నాథం కళ్యాణ మండపంలో కర్రి రమేష్ జ్ఞాపకార్థం కర్రి సన్యాసినాయుడు ఆర్థికసాయంతో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికోత్సవాలకు ప్రేక్షకులు, నాటక ప్రియుల నుంచి అపూర్వస్పందన లభిస్తోంది. హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ కన్నీటి కథ, రెండవ ప్రదర్శనగా భీమవరం ఒంప్రద క్రియేషన్స్ వారి హాస్యనాటిక బావా ఎప్పుడు వచ్చితీవు ప్రేక్షకులను అలరించాయి శిష్టా చంద్రశేఖర్ రచన, భాషా ఎస్ఎం దర్శకత్వంలో కేరళ రాష్ట్రం పాల్‌కాడ్ జిల్లాలో జరిగిన యదార్థ సంఘటన ఇతివృత్తంగా సాగిన నాటిక కన్నీటి కథ. ఒక బహుళ జాతి కంపెనీ గ్రామంలో రంగు నీళ్ల కంపెనీ స్థాపించి అక్కడ ఉన్న వారి బతుకును ఛిద్రం చేయడం, 600 అడుగులకు భూగర్భంలోతుకు వెళ్లినా చుక్కనీరు రాని స్థితిలో సాగు,తాగునీరుకు ప్రజల అవస్థలు, వ్యవసాయం సాగక అప్పుల ఊబిలో కూరుకు పోయిన అన్నదాతల సంఘటనే ఈ కన్నీటి కథ.ఇక రెండవ ప్రదర్శనగా 'బావ ఎప్పుడు వచ్చితీవు' హాస్యనాటికలో కొత్తగా పెళ్లి చేసుకున్న సుబ్బారావు భార్య పల్లెటూరు నుంచి పట్నానికి కాపురానికి వచ్చిన నేపథ్యంలో ఇక్కడ ఎవరితో ఎలా మసులుకోవాలో, ఎలా పిలవాలో, ఎలా మాట్లాడాలో అహంకారాన్ని వెలిబుచ్చుతూ చెబుతుంటాడు. అయితే చిన్నప్పుడే భారత, రామాయణాలను చదువుకున్న తాను ఎవరితో ఎలా మసులుకోవాలో, మాట్లాడాలో, ప్రవర్తించాలో బాగా తెలుసని భర్తకు బుద్ధి చెప్పిన ఇతివృత్తంతో ఆద్యంతం హాస్యభరితంగా సాగింది. రెండు నాటికల్లో నటీనటుల ప్రదర్శన అద్భుతంగా ఉండగా, నాటికల కథనం ప్రజలను ఆలోచింపచేసేదిగా ఉంది.

## ఆర్ఎఆర్ఎస్‌కు ర్యాంకుల పంట

### అగ్రి సెట్‌లో 100 లోపు 10 ర్యాంకుల సాధన

6,17, 28 ర్యాంకులు సాధించిన మల్లిక, సృజన, వరప్రసాద్

**ప్రజాశక్తి- అనకాపల్లి:** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన అగ్రిసెట్ 2023 ఫలితాల్లో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఎఆర్ఎస్) అగ్రి పాలిటెక్నిక్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 100లోపు 10 ర్యాంకులు సాధించి కళాశాల పేరును నిలబెట్టారని కళాశాల ప్రిన్సిపల్, ఎడిఆర్ డాక్టర్ పివికె.జగన్నాథరావు అన్నారు. 6, 17, 28 ర్యాంకులను మల్లిక, సృజన, వరప్రసాద్ సాధించడంతోపాటు 39, 43, 44, 55, 60, 68, 94 ర్యాంకులను సత్య శ్రీ, నాగలక్ష్మి, దిలీప్, వంశీ, రూప్నీ, పద్మ, విజయలక్ష్మి సొంతం చేసుకున్నారు. ఈనెల 18 నుంచి 21 వరకు అగ్రికల్చరల్ బిఎస్‌సికి వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో జోన్ల, కేటగిరి ప్రాతిపదికన తమ విద్యార్థులు మరికొంతమందికి సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాథరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వివిఎస్ గోపాలస్వామి, బోధన సిబ్బంది అభినందించారు.

## రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యంపై ఆందోళన ఉధృతం

మాట్లాడుతున్న జనసేన ఇన్‌ఛార్జి రాజు

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :** పెద్ద మదిన - గున్నెంపూడి రహదారి నిర్మాణపు పనులు వెంటనే ప్రారంభించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు హెచ్చరించారు. మంగళవారం పెద్దమదిన గ్రామంలో పలు గ్రామాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని, రెండు నెలల వెదర్లగడ్డ జంక్షన్ నుండి గున్నెంపూడి గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డును తవ్వించారని, తర్వాత పనులు చేపట్టకుండా వదిలేశారని మండిపడ్డారు. ఉన్న రోడ్డును తవ్వేసి, గుంతలమయంగా మార్చడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు మరింత ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డుప నులు చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి వియ్యపు అప్పారావు, ఎంపిటిసి వియ్యపు మరిడిబాబు, జనసేన మండల అధ్యక్షులు నాయుడు, ఉపాధ్యక్షులు రమేష్ బాబు పాల్గొన్నారు.

## సాంకేతిక సమస్యతో అందని రేషన్

### ఎనిమిది గ్రామాల గిరిజనులకు అవస్థలు

**ప్రజాశక్తి- దేవరాపల్లి:** మండలంలోని గర్నింగి పంచాయతీలో సర్వర్ పని చేయడం లేదని కారణంతో ఎనిమిది గ్రామాల గిరిజనులకు నేటి (17వ తేదీ) వరకు రేషన్ బియ్యం ఇవ్వక పోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఆయా గ్రామాల్లో నిరుపేద గిరిజనులకు రేషన్ బియ్యమే ఆధారంగా ఉండగా, ఇప్పటివరకు ఇవ్వకపోతే కుటుంబాలు గడిచేదెలాగని ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లో పోలాలన్నీ వర్షాధారం కావడంతోపాటు, వరి పండించేందుకు ఎటువంటి అవకాశం లేకపోవడంతో గిరిజనులు రేషన్ బియ్యంపై ఆధారపడి ఉన్నారని, దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సర్వర్ పనిచేయకుంటే మ్యాన్యువల్ పద్ధతిలోనైనా ఎనిమిది గ్రామాలగిరిజనులకు తక్షణమే రేషన్‌బియ్యాన్ని అందించే చర్యలు చేపట్టాలని కార్యదారులతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న డిమాండ్ చేశారు.

# అతిపెద్ద ఆర్థిక నేరస్తుడు జగన్

## ముఖ్యమంత్రిపై మాజీ ఎమ్మెల్యే పీలా ఫైర్

బాబుతో నేను నిరసనలో మాజీ ఎమ్మెల్యే పీలా, తెలుగుమహిళలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశంలోనే అతిపెద్ద ఆర్థిక నేరస్తుడని, తనలాగే అందరినీ జైలుకు పంపాలని ఆలోచన చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మంగళవారం తుమ్మపాలలో బాబుతో నేను కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చంద్రబాబు క్షేమంగా తిరిగి రావాలని సాయిబాబా, గంగాలమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికీ వెళ్లి బాబుతో నేను కరపత్రాలు పంపిణీచేశారు. టిడిపి మండల మాజీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి కొణతాల సావిత్రి, నడిపల్లి గణేష్, రాపేటి రామ్‌కుమార్, నడిపల్లి బోసుబాబు, గోవిందరావు మాస్టారు, సత్య అప్పారావు, బొడ్డపాటి గంగా శ్రీను, పల్లెల నాగేశ్వరరావు, కోట్ని ఈశ్వరరావు, సందిన చినబాబు, బత్తుల లక్ష్మి, బత్తుల రమేష్, తులసీ, గొర్లి మొదినాయుడు, జనసేన పల్లెల గణేష్, ఆకుల శ్రీనివాసరావు, గొర్లి శ్రీనివాసరావు, జగ్గారావు, బుజ్జి, కోడి అప్పారావు, అల్లం అప్పారావు, మళ్ళ అమ్మాజీ, కోటి పాల్గొన్నారు.

## సత్యదేవ్ ఆసుపత్రిలో కేన్సర్ వైద్యసేవలు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి సత్యదేవ్ ఆసుపత్రుల్లో కేన్సర్ సేవలు ప్రారంభించినట్లు సత్యదేవ్ ఆసుపత్రి అధినేత, వైసిపి వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బొడ్డేడ లక్ష్మి నరసింహారావు తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు, ఆంకాలజిస్ట్, డాక్టర్ వంగ వంశీ మోహన్ రోగులకు కేన్సర్ వైద్యసేవలను అందిస్తారన్నారు. అనకాపల్లి ప్రాంత కేన్సర్ రోగులకు సేవలు అవసరమనితన మిత్రుడు డాక్టర్ వంగా వంశీ మోహన్‌ను అభ్యర్థించగానే ఒప్పుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ వంశీమోహన్ నిరంతరం సత్యదేవ్ హాస్పిటల్‌కు అందుబాటులో ఉంటారన్నారు. కేన్సర్ నిర్ధారణ, చికిత్స సేవలను ఇకనుంచి సత్యదేవ్ ఆసుపత్రిలో పొందవచ్చని సూచించారు.

## నేడు చీడికాడలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-అనకాపల్లి : చీడికాడ మండల కేంద్రంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు స్పందనలో పాల్గొని, ప్రజల నుండి వినతులు ఫిర్యాదులు స్వీకరిస్తారు. చీడికాడ మండల ప్రజలు తమ సమస్యలను, అభ్యర్థనలను తెలియజేయవచ్చని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అన్నసమారాధన

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని అండర్ బ్రిడ్జి, వీర బ్రహ్మం గుడి వద్ద నవదుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భవానీలకు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏటా భవానీమాలాధారణ భక్తులకు ఉచిత అన్నసమారాధన ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. అన్నసమారాధనకు సహకరించిన దాతలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులను అభినందించారు.

అన్నసమారాధనలో పాల్గొన్న దాడి రత్నాకర్

# కొక్కిరాపల్లి వంతెన కొలిక్కి వచ్చేనా..!

- ★ 14 ఏళ్లుగా ఆగి, సాగుతున్న నిర్మాణ పనులు
- ★ రాష్ట్ర వాటా నిధులు విడుదలలో జాప్యమే కారణం
- ★ రెండు నెలలుగా పూర్తిగా నిలిచిన నిర్మాణం

పనులు నిలిచిన కొక్కిరాపల్లి రైలు వంతెన

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని కొక్కిరాపల్లి రైల్వేవంతెన పనులు నత్తనడకన ఆగి, సాగుతున్నాయి. బిల్లులు చెల్లించకపోవడంతో మళ్లీ రెండు నెలలుగా నిలిచిపోయాయి. చేసిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ రెండు నెలలుగా పనులు నిలిపివేసి, పత్తా లేకుండా పోయాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి,14 ఏళ్లు కావస్తున్నా అడుగడుగునా ఆటంకాలతో నేటికీ పూర్తి చేయని పరిస్థితి ఉండడంపై ప్రజలు విస్తుపోతున్నారు.

కొక్కిరాపల్లి రైల్వేవంతెనను రూ.35 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటాలతో చేపట్టేలా 2009లో పనులు ప్రారంభించారు. కేంద్రనిధులతో రైలు ట్రాక్‌పై బ్రిడ్జి పనులు సగం పూర్తయ్యాక ఆటంకాలు మొదలయ్యాయి. అసలు కాంట్రాక్టరు మొబిలైజేషన్ నిధులు పొంది, పనులు చేస్తున్న సబ్ కాంట్రాక్టర్‌కు ఇవ్వక పోవడంతో సమస్య మొదలయ్యింది.కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో బ్రిడ్జి పనులు ప్రారంభమైనప్పటికీ ఆ తర్వాత వచ్చిన తెలుగు దేశం హయాంలో కాస్త పనులు జరిగినా మళ్లీ కథ మొదటికొచ్చింది. నిధుల విడుదల కోసం స్థానిక ఎమ్మెల్యేలు ఇన్నాళ్లుగా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు నిధులు మంజూరుకు తీవ్రంగా ప్రయత్నం చేసి, అదనంగా మరో రూ. 8.50కోట్లతో ఇటీవల పనులు ప్రారంభింపజేశారు. రూ.4 కోట్ల పనులు పూర్తి చేశాక, ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లుల సొమ్ము చెల్లించకపోవడంతో వంతెన సమస్య మళ్లీమొదటికే వచ్చింది. రెండునెలలుగా పనులు నిలిచిపోయాయి. పైవంతెన పూర్తికాక యలమంచిలి పట్టణంలోకి, ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు కోసం ఎదురుచూసే వారికి ఇబ్బందులు పడే పరిస్థితి ఉది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోనైనా కొక్కిరాపల్లి రైల్వేవంతెన పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎలాంటి స్పందన ఉంటుందో వేచి చూడాల్సిందే.

### నిధులు విడుదల సమస్య ఉంది..

చేసిన పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ కొక్కిరాపల్లి రైలు వంతెన పనులు నిలిపి వేశారు. వంతెన నిర్మాణంలో పదే పదే సమస్యలు వస్తున్నాయి. ఇందులో ఆర్అండ్‌బి శాఖ ప్రమేయం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే మిగిలిన పనులు చేపట్టి, పూర్తి చేస్తాం.

– సత్యవేణి, ఎఇ, ఆర్అండ్‌బి, యలమంచిలి

# కరువు రైతాంగాన్ని ఆదుకోవాలి

## ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఐక్యవేదిక ధర్నా.. ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి :ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావంతో పంటలను నష్టపోయి కుదేలైన రైతాంగాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఆర్‌డిఒ చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేవారు. ఈసందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ చిన్నియాదవ్, అబ్దుల్ కలాం సేవాసంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, దేశానికి రైతే వెన్నెముక అంటూ ప్రసంగాలు చెప్పే పాలకులకు, కష్టాల్లో రైతుల కన్నీళ్లు కనిపించటం లేదా,వారిని ఆదుకోవాలన్న ఆలోచన రాకపోవడం దురదృష్టకరమన్నారు. అతివష్టి, అనా వష్టితో కుదేలవుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని, అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సేవాసమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, బిఎస్‌పి నేత సూరిశెట్టి రామచంద్రరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, నటభూషణ శోభన్‌బాబు సేవాసమితి చైర్మన్ ముగడా అప్పారావు, ఎన్ఎస్‌టిఎల్ నాయకుడు తొత్తర నూకరాజు, ముస్లిం సంక్షేమ సంఘం నాయకుడు షేక్ మదీనా భాషా పాల్గొన్నారు.

# టిడిపి నేతల ముందస్తు అరెస్ట్

ప్రజాశక్తి- మునగపాక రూరల్: టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆపార్టీ బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర మంగళవారం రాజమండ్రిలో తలపెట్టిన వంటావార్పు నిరసనకు మండల కేంద్రం నుంచి వెళుతున్న బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బొడ్డేడ ప్రసాదులను సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషనుకు తరలించారు.దీనిపై భీమరశెట్టి శ్రీనివాసరావు స్పందిస్తూ, శాంతియుతంగా తలపెట్టిన బాబుతో నేను కార్యక్రమంలో నిరసన తెలియచేయటానికి వెళుతున్న తమను అదుపులోనికి తీసుకోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇలాంటి నిర్బంధాలు ఎన్ని విధించినా వెనక్కు తగ్గేది లేదన్నారు. నిర్బంధాలు, నిరంకుశత్వంతో కక్షపూరిత పాలన సాగిస్తున్న సిఎం జగన్‌కు, వైసిపికి రానున్న ఎన్నికల్లో జనం ఘోరీ కట్టడం ఖాయమని హెచ్చరించారు.

# జలజీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యం

- ‘కరక’లో తాగునీటికి కటకట
- అరకొర పనులతో వృథాగా నీరు
- అధికారుల నిర్లక్ష్యంపై జనాగ్రహం

కరక గ్రామంలో జలజీవన్ మిషన్ వాటర్ ట్యాంకు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : జలజీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యం కారణంగా కరక గ్రామంలో తాగునీటికి కటకట తప్పడం లేదు. నిధులు మంజూరై, పనులు చేపట్టి పూర్తిచేసినా, చివరి దశలో అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు తాగునీరు అందని పరిస్థితి ఉంది. నీటిపథకం ట్యాంకు నిర్మాణం, పైపులైన్ పనులు చేపట్టినా, చివరలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటులోవాటిని ట్యాప్‌లు బిగించకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. మరోవైపు ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు.

మండలంలోని కరక గ్రామంలో కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.45 లక్షల నిధులతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులను ఐదు నెలల క్రితం ప్రారంభించారు. గ్రామంలోని 280 ఇళ్లకు తాగునీరు అందించే లక్ష్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, పైపులైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల ఏర్పాటుకు పైపులైన్లు కూడా వేశారు. అంతవరకు పనులు ఫర్వాలేదనిపించేలా సాగినా, ఆ తర్వాత నిండా నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇంటింటికీ వేసిన పైపులైన్లనకు కుళాయి ట్యాప్‌లను బిగించకుండా వదిలేశారు. గ్రామంలో కొన్ని ఇళ్లకు పైపులైన్లు కూడా వేయలేదు. ఇలా అరకొరగా పనులు చేపట్టిన అధికారులు, పనులను పూర్తిచేశామని అనిపించుకోవడానికి ఆదరా బాదరగా తాగునీటికి విడుదల చేస్తున్నారు. దీంతో ట్యాప్‌లు బిగించని కుళాయి పాయింట్ల వద్ద నీరు వృథాగా పోతుండగా, కొన్ని ఇళ్లకు కుళాయిలు వేయ లేదు. దీంతో అందరికీ జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అధికారుల నిర్లక్ష్యం, నిర్వాకం తూట్లు పొడుస్తోందని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అరకొర పనులు చేపట్టి, అర్థాంతరంగా వదిలేసి, ప్రజలకు తాగునీరు పూర్తిగా అందించని పరిస్థితులపై పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నేతలు స్పందించి తగ చర్యలు చేపట్టడం ద్వారా జలజీవన్ మిషన్ పథకానికి సార్థకత చేకూర్చాలని, ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

వృథాగా పోతున్న నీటితో ఆటలాడుకుంటున్న చిన్నారులు

# మొక్కుబడిగా మండల సమావేశం

**ప్రజాశక్తి-కోటవురట్ల:**మండల సమావేశం మందిరంలో మంగళవారం ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగానే సాగింది. తొలుత జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ, జడ్పీ నిధులు వివిధ గ్రామాలకు 41 లక్షలు మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించలేదని వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఉపాధి నిధుల మంజూరు పై స్పష్టత లేని సమాధానం చెప్పడం సరికాదని ఏపీవో గంగు నాయుడు పై పలువురు సభ్యులు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు మండలంగా ప్రకటించాలని కోటవురట్ల ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు కోరారు. నీలి గుంట అంగన్వాడి భవనం శిథిలావస్థకు చేరుకుందని, ఏ క్షణాన కూలుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని గ్రామ సర్పంచ్ వరహాల బాబు ప్రశ్నించారు. చౌడువాడ గ్రామానికి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్ సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు తెలియజేస్తున్న సభ్యుడు

. మట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

## 20న వైవి సుబ్బారెడ్డి పర్యటన

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :** వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఈనెల20న నర్సీపట్నం వస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ పార్టీ నాయకులతో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, నర్సీపట్నం మండలాల నుండి ఎంపీటీసీ, జడ్పిటిసిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. నియోజకవర్గ ముఖ్య నాయకులతో వైవి సుబ్బారెడ్డి సమావేశం ఉంటుందని, రానున్న ఎన్నికలకు దిశానిర్దేశం చేస్తారన్నారు.

# సిఐ రూ.2 వేల ఆర్థిక సాయం

**ప్రజాశక్తి -కొత్తకోట:**పాము కాటుకు గురై మృతి చెందిన మహిళ కుటుంబానికి కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాజ్ మహమ్మద్ ఆర్థిక సాయం అందజేశారు. రావికమతం మండలం కొత్తకోట ఎస్సి అరందతి కాలనీకి చెందిన మంజేటి పరదేశమ్మ పశువులను కాస్తూ పాము కాటుకు గురై మృతి చెందింది. నిరుపేద దళిత కుటుంబానికి చెందిన ఈమె భర్త కరియపాకును గ్రామాలలో విక్రయస్తూ జీవనం సాగిస్తుంటారు. కడు బీదరికం కావడం తో కనీసం భార్య దహన సంస్కారాలు చేయడానికి కూడా ఆర్థికంగా వెనక బడిన కుటుంబ కావడం వారి జీవన విధానాన్ని చూసిన కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మాహ్మద్ ఆయన తల్లి హసీనా సుల్తాన్ జ్ఞాపకార్థం రెండువేలు రూపాయలు ఆర్థిక నగదు సాయన్ని ఆ కుటుంబానికి అందజేశారు.

నగదు ఇస్తున్న సిఐ

## నిలిచిన డిజిటల్ లావాదేవీలు

**ప్రజాశక్తి -రావికమతం:** మండలంలో ఫోన్ పే, గూగుల్ పేలు గత నాలుగు రోజులుగా పని చేయక పోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. డిజిటల్ లావాదేవీలు ప్రతి ఒక్కరికి అనుకూలంగా మార్చుకోవడంతో దీనికి అలవాటు పడ్డ వినియోగదారులందరూ ఒక్క సారిగా ఇబ్బంది పడ్డారు. ఫోన్ పే, గూగుల్ పేలపై ఆధారపడి షాపింగ్‌కు వెళ్లినవారు సామాన్లు కొనుగోలు చేసుకున్న తర్వాత పని చేయక పోవడంతో వినియోగదారులకు ఏమి చేయాలో అర్థం కాలేదు. టెక్నికల్ సమస్యలపై కాలియాపన చేయడం సరికాదని వినియోగదారులు మోహన్, నాయుడు బాబు, వరహాలు, శ్రీను, సత్యవేణి, కాశి తెలిపారు.

## విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

**ప్రజాశక్తి-మాడుగుల:** నానాటికి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు భారం పెంచుకుంటూ పోతుందని, తక్షణమే తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి కార్లే భవాని తెలిపారు. మంగళవారం మండలంలో వొమ్మలి గ్రామంలో పర్యటించిన ఆమె మాట్లాడుతూ, విద్యుత్ ఛార్జీల భారంతో పేదల జీవనం నానాటికి కష్టతరంగా మారిందన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో మూడుసార్లు చార్జీలను పెంచిందని, కరెంట్ బిల్లు చూస్తే షాక్ కొడుతున్నాయన్నారు.యూనిట్ స్లాబ్ రేట్లు మార్చుతూ ప్రజల కళ్ళు కప్పి భారాన్ని పెంచుతుందన్నారు. ఇలా ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలు పెంచుకుంటూ పోతే ప్రజల ఆగ్రహానికి ప్రభుత్వాలు గురి కావడం ఖాయమని భవాని తెలిపారు.

## జనసేనలో చేరిక

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:**నాతవరం మండలం ఎస్‌బి.పట్నం గ్రామానికి చెందిన 25 వైసిపి కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. జనసేన నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం వీరంతా ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ, .గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పొన్నపు పోతురాజు, ఈరుడు బద్రి, నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ, చినరాజు, జనసైనికులు పాల్గొన్నారు

# వాడవాడలా జగనన్న ఆరోగ్య సురక్ష

నక్కపల్లిలో స్టాల్స్‌ను సందర్శిస్తున్న ప్రజాప్రతినిధులు

**ప్రజాశక్తి- నక్కపల్లి:**నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్న కుమారి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు సందర్శించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోషకాహార స్టాల్స్‌ను పరిశీలించారు. వైద్యులు రోగులు పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు .

**గొలుగొండ:**జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతాయని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం చీడిగుమ్మల-2 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**అనకాపల్లి :** మండలంలో సత్యనారాయణపురం శివారు మూలపేటలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శన స్టాళ్లను సందర్శించారు. మిల్లెట్స్ వంటకాలను రుచి చూశారు. గర్భిణులకుసామూహిక సీమంతాలు చేశారు. సర్పంచ్ పలక భాగ్యలక్ష్మి సత్తిబాబు, ఎంపిటిసి కర్రిమజ్జి అలివేణి మల్లేశ్వరరావు, వైస్ సర్పంచ్ పొట్టుకురి అప్పలరాజు, పి ముత్యాలరావు, కర్రి మజ్జి మహాలక్ష్మి నాయుడు, చవ్వాకుల ఈశ్వరరావుపాల్గొన్నారు.

**చోడవరం:** మండలం భోగాపురం సచివాలయంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**కశింకోట:**కొత్తపల్లి హైస్కూల్ వద్ద ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంపీ డాక్టర్‌బివి.సత్యవతి పాల్గొన్నారు.రోగులకు ఆరోగ్య సూచనలు చేశారు. ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, మండల ఉపాధ్యక్షులు పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, నమ్మి మీణా గణేష్ గ్రామ సర్పంచ్ కరణం శ్యాంసన్, కోన నాయుడు, వైసిపి నేత అద్దేపల్లి శ్రీను పాల్గొన్నారు

**మునగపాక రూరల్:** అరబుపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీ బీవీ సత్యవతి, ఎలమంచిలి ఎమ్మెల్యే యువి .రమణమూర్తిరాజుప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని , రైతు భరోసా కేంద్రాన్ని రూ.రూ.20 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును, రూ.9 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు . డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, జెడ్‌పిటిసి పెంటకోట సోమ సత్యనారాయణ, సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ లక్ష్మీనారాయణ (బుజ్జి), ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, పొలిమేర పూర్ణచంద్ర గణేశ్వరరావు, కోనపల్లి రామ్మోహనరావు, పిల్లి అప్పారావు పాల్గొన్నారు.

**బుచ్చయ్యపేట :** పెదపూడి గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. వైద్యసేవలను పర్యవేక్షించి, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు, సువర్ణరాజు, సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, డాక్టర్ సంధ్యారాణి, పాల్గొన్నారు.

**కె.కోటపాడు :** చౌడువాడలో అరోగ్య సురక్ష శిబిరాన్ని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ పరిశీలించారు. ఐసిడిఎస్ పౌష్టికాహార స్టాళ్ల, వైద్యపరీక్షలు, మందులుపంపిణీ విభాగాలను పరిశీలించారు.ఎంపిపి రెడ్డి జగన్మోహన్, సర్పంచ్ దాడి ఎరుకునాయు, ఎంపిటిసి ఎటుకూరి రాజేష్, దాట్ల శివాజీ, సిడిపిఒ మంగతాయారు స్థానిక వైద్యాధికారులు లలిత, హారిక, స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**దేవరాపల్లి** :మండలంలోని బోయిల కింతాడలో అరోగ్య సురక్ష శిబిరాలను జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధ పరిశీలించారు. సర్పంచ్ బూరె బాబురావు, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, వైసిపి నేతలు కర్రి సూరినాయుడు, కోటాన వెంకటరమణ, ఏటుకూరి అప్పారావు,వైద్యాధికారులు లలిత హారికా, గోవిందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు పాల్గొన్నారు.

**గాజువాక :** జివిఎంసి 65వ వార్డు ప్రియదర్శిని కాలనీలోని యుపిహెచ్‌సి వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు, జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, స్థానిక నాయకులు లోకనాథం, నగిశెట్టి శ్రీనివాస్, మంగు నాయుడు, దేముడు, జుత్తు లక్ష్మి, ఎల్‌వి.రమణ, అప్పలరాజు, పెంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

**భీమునిపట్నం :** జివిఎంసి 3వ వార్డు స్మిత్‌వీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఏడు రకాల వైద్య పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి వివిధ ఆసుపత్రులకు రిఫర్ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, వైసిపి మూడో వార్డు అధ్యక్షులు అల్లిపిల్ల నరసింగరావు, వైసిపి నాయకులు వి.కొండబాబు, వి.ఎల్లాజీరావు, వైద్యులు కల్యాణ్, అఖిల, యుసిడి ఎపిడి ఎల్లపు సంతోష్, సిఒ విజయలక్ష్మి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ములగాడ :** 59వ వార్డు పరిధి నక్కవానిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త వైసిపి ఆడారి ఆనంద్ కుమార్ శిబిరంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వాలంటీర్లు, వైసిపి అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి-యస్.రాయవరం:**మండలంలో కొరుప్రోలు సెక్షన్ పరిధిలోని గ్రామాలకు ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కొరుప్రోలు సెక్షన్ ఏఈ బి.గోపి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి డివిజనల్ ఇంజనీరు ఆదేశాల మేరకు కొరుప్రోలు 33/11 కెవి సబ్ స్టేషన్ మెయింటనెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొరుప్రోలు సెక్షన్ లోని బంగారమ్మపాలెం, చిన ఉప్పలం, రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం, గుడివాడ, పెదఉప్పలం, గుర్రాజుపేట, కొరుప్రోలు, అడ్డురోడ్డు, కోనవినిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయ ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చదువుతున్న విద్యార్థులు

## గ్రంథాలయంలో పుస్తక పఠనం

**ప్రజాశక్తి-గొలుగొండ:**గొలుగొండ శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల శిక్షణా శిబిరం సందర్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి రామకృష్ణ మాస్టారు మాట్లాడుతూ గ్రంథాలయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నీతి కథలు చెప్పి వాటిపై అవగాహన కల్పించారు.

# క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

## - అనకాపల్లి జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ
## -శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో ముగిసిన ఖోఖో పోటీలు

విజేతలకు బహుమతులు అదజేస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

**ప్రజాశక్తి -పాయకరావుపేట:**విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో మెలిగి గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని అనకాపల్లి జిల్లా ఎస్పి కె.వి మురళీకృష్ణ సూచించారు. స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో జరిగిన సిబిఎస్ఇ క్లస్టర్ 7 ఖో ఖో పోటీలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ఈ పోటీలకు ఆంధ్రా, తెలంగాణా నుండి 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ముగింపు కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ మాట్లాడుతూ,. క్రీడలతో ఎన్నో రకాల విషయాలు నేర్చుకోవచ్చన్నారు., క్రీడలలో ఓటమి చెందినవారు ఎప్పటికి ఓటమి పాలైనవారిగా ఉండరని గెలుపు దిశగా పయనించడానికి అడుగులు వేస్తారని, తెలిపారు. గెలిచిన వారు కూడా ఎప్పుడోకప్పుడు ఓటమి చవి చూస్తారని, అందుకే గెలుపు ఓటమి లు సమానంగా స్వీకరించే సత్తా ఒక్క క్రీడాకారులకే సాధ్యమని అయన తెలిపారు. నేర్చుకునే ప్రతిభ క్రీడల ద్వారానే సాధ్యమవుతుందని, కలిసికట్టుగా పోరాడితేనే విజయం సాధ్యమవుతుందనే విషయం విద్యార్థులకు క్రీడా స్ఫూర్తితోనే అలవడు తుందన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాల కంటే బాహ్య ప్రపంచం నుంచి చాలా విషయాలు నేర్చుకోవాలన్నారు. విద్యార్థి దశలో మిక్కిలి అభిరుచి తో నేర్చుకుంటేనే రాణిస్తారని తెలిపారు. ఆటలు, చదువులోనైనా పునాది చాలా ముఖ్యమని, మంచి పౌరులుగా రూపొందడానికి సీబీఎస్ఈ ప్రణాళిక సరైన రీతిలో దో హ ద ప డు తుం ద ని చెప్పారు.ఏబీజె అబ్దుల్ కలాం వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన జీవితాన్ని ప్రతీ విద్యార్థి అవగతం చేసుకోవాలని తెలిపారు.విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని అయన తెలిపారు. అనంతరం ఆయన గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు.
విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల నుండి ఈ క్రీడలకు సుమారు 1200 మంది విద్యార్థులు వచ్చినందుకు తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, అబ్జర్వర్ జి.శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ అఫ్ ఖోఖో ఫెడరేషన్ సిహెచ్. ఎల్.ఎం శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ అపర్ణ, నీళాదేవి, వ్యాయమ ఉపాధ్యాయులు, రిఫరీలు, కోచ్ లు పాల్గొన్నారు.

కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

## అయ్యన్న ఇంటి వద్ద పోలీసుల మోహరింపు

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద మంగళవారం పోలీసులు భారీగా మోహరించారు. అయ్యన్న పాత్రుడు ఇంటి వెలుపలికి, బయటికి వచ్చే వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా జిల్లాలో ఇప్పటికే నిరసనలు కొనసాగుతున్నాయి. పలుచోట్ల బాబుకు తోడుగా, నిరాహార దీక్షలు, బాబుతో నేను పేరిట ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ జరుగుతుంది.


వైయస్సార్ భీమా అందజేస్తున్న సర్పంచ్

## వైఎస్ఆర్ బీమా నగదు అందజేత

**ప్రజాశక్తి-రోలుగుంట:**మృతుని కుటుంబానికి వైయస్సార్ భీమా పథకంలో భాగంగా తక్షణ సాయం కింద నగదును కుసర్లపూడి సర్పంచ్ అప్పలనాయుడు మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన అంబటి వరలక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. దీంతో మృతుని తల్లి లక్ష్మికి దహన ఖర్చుల నిమిత్తం రూ.10వేలను అందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న ఏఒ

## వరి పంటల పరిశీలన

**ప్రజాశక్తి-రోలుగుంట:**మండలంలో ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి పంటకు పాముపొడ తెగులు, దోమ, తెల్లరేకు(ఆకుముడత) ఆశిస్తున్నాయని మండల వ్యవసాయాధికారి వరలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు ఆమె వరి పంటను పరిశీలించారు. పాముపొడ తెగులు, దోమ నివారణకు ఏస్‌పేట్ 1.5 గ్రాములు, మనోక్రోటోపాస్ 1.6ఎంఎల్ లీటరు నీటిలో కలిపి ఒక ఎకరానికి 200 మీటర్లు పిచికారీ చేయాలన్నారు.

## 20న దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలో చోద్యం గ్రామంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొందల రాజు ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో నిర్మిస్తున్న దేవాలయంలో ఈనెల 20న శుక్రవారం దుర్గా దేవి మాత విగ్రహ ప్రతిష్ట చేయచున్నారు. విగ్రహ ప్రతిష్ట కోసం ఈ నెల 18, 19 తేదీల్లో వేదపండితులతో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నారు. అలాగే విగ్రహ ప్రతిష్ఠ రోజున సుమారు 5వేల మందికి భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు కోరారు.

# అత్యాధునిక పద్ధతులతో రొమ్ము కేన్సర్‌కు చికిత్స

మాట్లాడుతున్న మురళీకృష్ణ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** రొమ్ము క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్య సదుపాయాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఎమ్‌డి డాక్టర్ వి.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం మేఘాలయ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారిందని తెలిపారు. రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే పద్ధతులను వివరించారు. తమ ఆసుపత్రి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అతిపెద్ద సమగ్రవంతమైన క్యాన్సర్ హాస్పిటల్ అని తెలిపారు. ఇక్కడ అన్ని సేవలూ అందుతాయన్నారు. దేశంలోని అన్ని ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌ల నుండి తర్ఫీధు పొందిన ఆంకాలజిస్టులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. తాము అత్యాధునిక కృత్రిమ మేధస్సు కలిగిన ఐ - బ్రెస్ట్ పరికరంతో గ్రామీణ ఔట్రీచ్ బ్రెస్ట్ - క్యాన్సర్ స్క్రీనింగ్ చేపడుతున్నామని తెలిపారు.

## నేవీ ఉద్యోగుల వసతి గృహాలు ప్రారంభం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఐఎన్ఎస్ డేగాలో ఆరు అంతస్తుల నావికుల వసతి గృహాల సముదాయాన్ని మంగళవారం ఉదయం ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ప్రారంభించారు. 144 మంది నావికులకు వసతి కల్పించే ఈ భవనంలో అత్యాధునిక పారిశ్రామిక వంటగది, డైనింగ్ హాల్, వినోద సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

## పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

**ప్రజాశక్తి -పాయకరావుపేట:**స్థానిక పోలీస్ స్టేషన్ ను అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి మురళీకృష్ణ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. పాయకరావుపేట మండల పరిధిలో నేరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు.

## సచివాలయం ప్రారంభం

**ప్రజాశక్తి- పెదబయలు:** మండలంలో గంపరాయి పంచాయతీ కేంద్రంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిభిరంలో ప్రజలకు వైద్యాధి కారిణి సిందూరం, శంకర్ ఫౌండేషన్ వైద్యాధికారులు సర్వేశ్వర్‌రావు, నరసింహారెడ్డి, చంద్రశేఖర్‌లు వైద్య సేవలు అందించారు. అనంతరం కిముడుపల్లి పంచాయతీ సచివాల యంను ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ పారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగనన్న సురక్షతో ప్రభుత్వం వ్యాధుల బారిన పడిన పేదలకు ఉచిత వైద్యం అందిస్తుందన్నారు. సచివాలయం ప్రారంభోత్సవానికి ముగ్గురు గ్రామ వాలంటీర్లు హాజరు కాక పోవడంతో విధుల నుండి తొలగించాలని ఎంపీడీఓ ఎల్. పూర్ణయ్యను ఆదేశించారు. సర్పంచ్ శోభారాణి, రాష్ట్ర వైస్సార్సీపీ కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలపై దృష్టి

## -ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

మాట్లాడుతున్న చైర్మన్ శంకరరావు

**ప్రజాశక్తి- అనంతగిరి:**గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై ఎస్టి కమిషన్ స్పందిస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి. శంకరరావు అన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ఆయన మంగళవారం అనంతగిరి మండలంలో పర్యటించారు. కాశీపట్నంలో కొత్తమ్మ తల్లి గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తూరు కస్తూరిబా పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందన్నారు.ఇందులో భాగంగానే ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రాథమిక వైద్యంతో పాటు ప్రత్యేక వైద్యాన్ని ప్రజల ముంగిటకే తీసుకొని వచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.టూరిజం కార్మికుల సమస్యలను యూనియన్ ప్రతినిధులు నరసింహ, సోమేష్, బుద్ధరాజు సన్యాసమ్మ తదితరులు ఎస్టీ కమిషన్ చైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ మండల ప్రతినిధులు రాంబాబు, భాస్కర్, మల్లేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. పుట్టచింత గ్రామంలో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన వంతల మోహన్ కుటుంబ సభ్యులను కమిషన్ సభ్యురాలు కొర్రా. రామలక్ష్మి, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరిలతో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సారా సీతయ్య, ఎంపీటీసీ సభ్యులు మూతిబోయిన సన్యాసిరావు, వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, వైస్ సర్పంచ్ నరేంద్ర కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు, సహాయ గిరిజన సంక్షేమ అధికారి వెంకటరమణ, ఎంపీడీవో హర్షిత్, తహసిల్దార్ రాంబాయి పాల్గొన్నారు.

## గుండెపోటుతో వాలంటీర్ మృతి

**ప్రజాశక్తి -అనంతగిరి:**మండలంలోని కొండిబ పంచాయతీ పరిధి లింబగుడ గ్రామానికి చెందిన వాలంటీర్ గుబాయి. రవికుమార్ (32) గుండెపోటుతో మృతి చెందాడు. తన కుటుంబ సభ్యులతో సోమవారం బొర్రా గుహలు, కట్టికి జలపాతం తిలకించేందుకు వెళు న్న క్రమంలో మార్గమధ్యలో హఠత్తుగా గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు సుంకరమెట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అరకు ఏరియా ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు పరిస్థితి విషమంగా ఉండటంతో అందుబాటులో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం జిల్లా ఎస్ కోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కెజిహెచ్‌కు తరలించేందుకు అంబులెన్స్ ఎక్కిస్తుండగా కుపకూలి అక్కడికక్కడే వాలంటీర్ మృతి చెందాడు. వైద్య అందకపోవ్వడంతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.